# 23. పిచ్చి లచ్చి మెచ్చి వచ్చి

ఏ బహుమానమూ రాని అయిదు లాటరీ టికెట్లను పాత చెక్కపెట్టెలో పడేసేందుకు వీరయ్య పెట్టెమూత తెరిచాడు. కాని అప్పటికే నిండి ఉన్న ఆ పెట్టెలో మరి ఖాళీ లేదు. ఎలాగో బలంగా అణిచి ఆ పనికిరాని టికెట్లను అందులోకి కుక్కాడు.

పెట్టె నిండుగా ఉన్న ఆ పనికిరాని కాగితాల్ని చూస్తే వీరయ్యకు బావురుమని ఏడవాలనిపించింది. తనకు తెలియకుండానే గత ఆరేళ్ళలోనూ కొన్న లాటరీ టికెట్ల విలువ కనీసం ఆరేడు వేల రూపాయలన్నా ఉంటుంది. ఏదో అదృష్టాన్ని నమ్మి ఎంత డబ్బు తగలేశాడు. ఆ పైకం చేతిలో ఉండి ఉంటే ఇంటి మీద తను చేసిన అప్పు మూడు వొంతులు తీరేది. చేతిలో ఉన్నది నిశ్చయంగా ఉన్నట్లే, లాటరీ టికెట్ల రూపంలో ఉన్నది ఎండమావిలాటిది!

ఎవ్వరికీ తెలియకుండా మర్నాడు నీళ్ళ పొయ్యిలో ఆ చెత్త కాగితాలు కాల్చేసేందుకు వీరయ్య నిశ్చయించుకున్నాడు.

కాని ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు. ఉన్న కరుకు రూపాయిల్ని ఎంత నిరుపయోగంగా గంగపాలు చేశాడో తలుచుకుంటే గుండె గుభేలుమంటోంది. వీరయ్యకు తనమీద తనకే అసహ్యమనిపించింది. చివరకు అయిందేమో అయింది. ఇక ముందు ఈ వెధవ లాటరీ టికెట్లు కొనకూడదని దృఢ నిశ్చయానికి వొచ్చాడు.

మర్నాడు ఉదయం నీళ్ళపొయ్యి దగ్గర కూర్చొని ఓపిగ్గా తన కష్టార్జితాన్ని హరించిన చెత్తకాగితాల్ని తగలేయసాగాడు వీరయ్య.

"ఏవండోయ్! ఎక్కడో కాగితాలు కాలిన వాసన వేస్తోంది – చూడండి! ఒరేయ్ రాంబ్రహ్మం చూడరా!" అని భార్య పొలికేకలు పెట్టింది.

అందుకు కారణం లేకపోలేదు. వీరయ్య వృత్తికి ముఖ్యంగా కావలసింది కాగితాలే! వీరయ్య బైండర్. ఒక పబ్లిషర్‌కు ప్రత్యేకంగా పుస్తకాలు బైండు చేసి ఇస్తాడు. మొదటి నుంచీ కష్టపడి పని చేసుకుంటూ తిండికీ, బట్టకూ లోటు లేకుండా సంసారం సాగిస్తున్నాడు. వృత్తిలో సంపాయించే ఈ ఇల్లు కొన్నాడు. ముగ్గురు కూతుళ్ళకు పెళ్ళిళ్ళు చేశాడు. కాకపోతే ఆ పెళ్ళిళ్ళకు ఎనిమిది వేలు ఇల్లు తాకట్టుమీద అప్పు చేశాడు. అసలు తీరలేదు. వడ్డీ మాత్రం మాసం మాసం నూట అరవై రూపాయలు కడుతున్నాడు. లాటరీ తగులుతుందేమో ఈ పీడ వొదిలించుకుందామని ఎంత గుంజుకున్నా ఈ చిత్తుకాగితాలే మిగిలాయి!

బైండింగ్ నిమిత్తం ఇచ్చిన తెల్ల కాగితాలు అంటుకున్నాయేమోనని ఇల్లాలు గాబరా పడింది.

"పనికిరాని చెత్తకాగితాలు తగలేస్తున్నాను" అని అరిచాడు వీరయ్య.

కష్టపడి చెమటోడ్చి సంపాయించిన కరెన్సీ నోట్లను లాటరీ టికెట్లుగా మార్చి, ఫలితం లేక తగలేస్తూ, పనికిరాని చెత్త కాగితాలు అనవలసిన ఖర్మ పట్టింది.

సంపాదించింది రూపుమారి బుగ్గి అయిపోతే ఏం చెయ్యలేక, ఎంతో దుఃఖపడ్డాడు వీరయ్య. అదంతా పీడకలగా భావించి మరిచిపోవాలనీ, ఇకనైనా ఈ జూదంలోకి తల దూర్చరాదనీ మరోసారి నిశ్చయించుకున్నాడు వీరయ్య.

## 2

నాలుగు రోజుల తరువాత ఒక సాయంత్రం ప్రచురణకర్తకు కాపీలు అప్పగించి బిల్లు వసూలు చేసుకొని వస్తున్నాడు. మలుపు మలుపుకూ ఉన్న రకరకాల లాటరీ టికెట్లను అమ్మే బంకుల వైపు కూడా ఈ మధ్య చూడటంలేదు వీరయ్య.

ఒక పక్కగా ఇద్దరు మాట్లాడుకుంటుండగా విన్నాడు వీరయ్య.

"రెండు రోజుల్నుంచీ పిర్రలమీద ఒకటే దురద... వేడినీళ్ళు పోస్తే చమ్మగా హాయిగా ఉంటుంది. గోకితే గాయమయ్యే ప్రమాదం ఉంటుందేమోనని భయం. డాక్టర్ను చూడాలనుకుంటున్నాను" అన్నాడు ఒకడు.

తనకు కూడా అప్పుడప్పుడు ఇలా దురదపుట్టటం, గోక్కుని తృప్తి పడటం జరుగుతోంది. ఈ సంభాషణ వినాలని వీరయ్య ఆగాడు.

"పిచ్చివాడా! దీనికోసం డాక్టర్ దగ్గిరికి వెళ్ళక్కర్లేదయ్యా!" అన్నాడు రెండోవాడు.

"మరి...?"

"నీకు లక్ష్మీ ప్రసన్నం కాబోతూన్నందుకు ఈ దురద సూచన!"

"ఎట్లా?"

"లక్ష్మీదేవి పుట్టిందే తామరపువ్వులో. అందుకని పిర్రలమీద తామర ఉంటే లక్ష్మీదేవి రాకకు హెచ్చరిక!"

రెండోవాడు నవ్వాడు.

"లక్ష్మి నన్ను వరించేందుకు నాకేం అర్హత ఉన్నది?" అన్నాడు.

"పిచ్చి లచ్చి మెచ్చి వచ్చి పడిన వాళ్ళందరూ అర్హులా? ఎంతమంది దుర్మార్గుల్ని, నీచుల్ని, మూర్ఖుల్ని ఆమె వరించలేదు? ప్రపంచం చూస్తే నీకే అర్థమవుతుంది. అందుకనే లచ్చికి పిచ్చి అనటం సబబు. ఆమె వరించిన వారిలో నూటికి అయిదు మందన్నా యోగ్యులు ఉన్నారా?"

"సరే చూద్దాం!"

"సిరిరా మోకాలు అడ్డకు. నా మాట విని ఏ లాటరీ టికెట్టో కొను. అంతమాత్రం ప్రయత్నమన్నా చేయకుంటే ఆమె ఆహ్వానమే లేదని తన దర్శనాన్ని విరమించుకోవచ్చు."

"అలాగే! పది టికెట్లు కొంటాను!"

ఈ సంభాషణ విన్నప్పటినుంచీ నిజంగానే దురదే పుట్టిందో, లేదా అలాటి భావన కలిగిందో కాని వీరయ్య గోళ్ళు గోకటంలో నిమగ్నమయ్యాయి.

తాను ఆ సంభాషణ విన్నప్పటి నుంచీ వీరయ్య మనస్సు మళ్ళీ లాటరీ టికెట్లు కొనేందుకు పెరపెరలాడుతోంది.

ఆ రాత్రి వీరయ్యకు కలలో లక్ష్మీదేవి ప్రసన్నమైంది. మనసు ఉరకలేస్తూంటే, బుద్ధి నిరుత్సాహపరిచి వెనక్కు లాగుతోంది. అయితే ఈ మథన, బుద్ధికీ మనసుకూ ఘోరమైన పోరాటం లోపల రగులుతూనే ఉంది.

మర్నాడు ఉదయం బయటికి వెళ్ళాడు వీరయ్య. సందుచివర్లో ఉన్న లాటరీ టికెట్లు అమ్మేవాడు వీరయ్యను ఆహ్వానించాడు. "హర్యానా లాటరీ సార్! మొదటి బహుమతి అయిదు లక్షలు...!" అంటున్నాడు.

సంవత్సరాల తరబడి లాటరీ టికెట్లు కొన్న తాను ఈ చివరి ప్రయత్నం కూడా చేసి, ఫలితం లేకుంటే శాశ్వతంగా మానుకోవచ్చు కదా! ఆ మాత్రం ప్రయత్నమన్నా లేకుండా లక్ష్మి దర్శనమిస్తుందా?

తాను చెయ్యదలచిన పనిని మానవుడు ఎన్నో విధాల సమర్థించుకుంటూనే ఉన్నాడు.

వీరయ్య హర్యానా లాటరీ పది టికెట్లు కొన్నాడు. 'దాలిగుంటలోని కుక్క!' అంటాం కాని, మానవుడు అంతకన్న వేరుగా ఉన్నాడా?

అయిదు లక్షలు! తలుచుకుంటేనే ఒళ్ళు పులకరిస్తోంది. ఆ మొత్తం చేతికి వొస్తే చేయవలసిన పనులు ఆలోచిస్తున్నాడు వీరయ్య. ఈ ఇల్లు పడగొట్టి రెండు అంతస్థుల

మేడ కట్టాలి. కింద బైండింగ్ ఆఫీసు, పైన నివాసమూ ఏర్పర్చుకోవాలి. కొడుక్కు పెళ్ళి చెయ్యాలి. ఇంటి మీది అప్పు తీర్చాలి. అవసరాలకు కావలసి వొస్తుందేమోననే జాగ్రత్తతో కనీసం ఒక ఏభై వేలు. బాంకులో వేసుకోవాలి. ఆహా! ఆ ఆలోచనలు ఎంత తృప్తినిస్తున్నాయి! ఎన్ని గాలిమేడలు కట్టుకున్నాడో! రోజుల తరబడి ఇవే ఆలోచనలతో వీరయ్య సతమతమవుతూనే ఉన్నాడు.

## 3

ఇవాళ లాటరీ ఫలితాలు ప్రకటిస్తారు. 'ఏ బహుమతి వొచ్చినా గుళ్ళో పది కొబ్బరికాయలు కొడతా'నని మొక్కుకున్నాడు వీరయ్య.

ఇటీవల దురద కూడా మరీ పెరిగింది. గజ్జెలు గలగలలాడిస్తూ లక్ష్మీదేవి వొస్తున్నట్లే అనిపించింది.

ఎంతో ఆతృతతో వీరయ్య లాటరీ ఫలితాలకోసం ఉరుకులు పరుగుల్తో వెళ్ళాడు. నంబర్లన్నీ సిరా పోసి అలికినట్లుగా కనిపించాయి. ఒక్క నంబరు కూడా కనిపించటం లేదు.

కళ్ళు మూసుకొని ఒక్క క్షణం ఆగి ఆతృత తగ్గించుకొని ఫలితాలు చూడసాగాడు వీరయ్య. ఇప్పుడు నంబర్లు స్పష్టంగానే ఉన్నాయి. జాగ్రత్తగా చూశాడు వీరయ్య.

ఆశ్చర్యం! లాటరీ తగిలింది వీరయ్యకు! తాను పొరబడ్డానేమోనని మళ్ళీ మళ్ళీ చూశాడు. తన టికెట్టుకు అయిదో బహుమతి - నలభై వేలు వచ్చింది. సందేహం లేదు. నలభై వేలైతే మాత్రం చేదా? జీవితమంతా కష్టపడినా తను తిని ఆ మాత్రం మొత్తం కూడబెట్టగలడా?

దాదాపు నాట్యం చేసుకుంటూ ఇంటికొచ్చాడు వీరయ్య. ఈ శుభవార్త భార్యకీ, కుమారుడికీ చెప్పాడు. ఆ ఇల్లాలు ఇరుగు పొరుగులకు చెప్పింది. 'ఎంత అదృష్టం!' అనుకున్నారు అందరూ.

అంతటితో ఆగలేదు. సాయంత్రానికల్లా సంవత్సరాల తరబడి కలవని మిత్రులు వీరయ్య దర్శనానికి వచ్చారు. వీరయ్యను అభినందించారు. తమ కష్టాలు చెప్పుకున్నారు. ఉచితంగా కాదు కాని అప్పుగా డబ్బు అడిగారు. వీరయ్య జవాబు చెప్పకుండా వాళ్ళను వొదిలించుకున్నాడు.

యజమానికి వార్త అందించాడు. "వీరయ్యా! అంత డబ్బు ఏం చేస్తావు?" అన్నాడు యజమాని.

"ఇంటి మీద అప్పు ఎనిమిదివేలు. ఇల్లు చాలా ఇరుగ్గా ఉన్నది. మరో రెండు గదులు వెయ్యాలి. అప్పుడు కొడుక్కు పెళ్ళి చెయ్యాలి... ఇంకా టి.వి., ఒక ఫ్రిజ్,

మోటార్ సైకిలూ...వెధవ నలభై వేలూ ఏ మూలకు?” వీరయ్య అంచనాలు ఇలా ఉన్నాయి.

## 4

నాలుగో నాడు సాయంత్రం వీరయ్య ఇంటికి వచ్చేటప్పటికి ఇల్లంతా సందడిగా ఉన్నది. ముగ్గురు కూతుళ్ళూ, ముగ్గురు అల్లుళ్ళూ దిగారు. వారికి తగిన విధంగా మర్యాదలు చేసేందుకు ఇల్లాలు వంట పనిలో నిమగ్నమై ఉంది.

అందరూ వీరయ్య అదృష్టాన్ని అభినందించారు. బంధువుల మధ్య రెండు రోజులు సంతోషంగా గడిచాయి.

దూరపు బంధువులు ఏళ్ళ తరబడి తన క్షేమాన్ని విచారించని వారు కూడా దిగారు. ఇల్లు చాలటంలేదు. వంటలూ, వడ్డింపులూ చేయలేక గృహిణి సతమతమవుతోంది. వీళ్ళంతా పిలవని పేరంటానికి దిగారు. ఇంకా ఎన్నాళ్ళు ఉంటారో తెలియదు. ఎప్పుడు వొదుల్తార్రా దేవుడా! అనుకున్నాడు వీరయ్య.

మరో రెండు రోజులు గడిచాక వీళ్ళంతా ఎందుకొచ్చారో తెలియసాగింది.

“నాన్నా! సంసారం గడవటం చాలా కష్టంగా ఉంది. మా ఇల్లు తాకట్టులో ఉంది. పదివేలు ఉంటే ఇల్లు దక్కుతుంది” పెద్దమ్మాయి చెప్పింది.

“నాన్నా! మా ఆయన సైకిల్ షాపు నడుపుతున్నాడని తెలుసు కదా! పది సైకిళ్ళన్నా కొత్తవి కొంటే అద్దెలకు తిప్పి కాస్త సంపాయించుకోవచ్చు. ఒక ఆరువేలు: ఇవ్వు నాన్నా!” రెండో అమ్మాయి డిమాండ్.

“దమ్మిడీ కట్నం లేకుండా నన్ను చేసుకున్నాడు మీ అల్లుడు. ఎంత యోగ్యుడో నీకు తెలుసు. బయట పెద్ద వడ్డీలకు డబ్బు అప్పుజేసి దుకాణం నడుపుతున్నాడాయన. లాభంలో సగానికి పైగా వడ్డీలకు పోతోంది. పదిహేను వేలుంటే అప్పులు తీర్చి వ్యాపారం వృద్ధి చేసుకోవచ్చు. మాకేం ఉచితంగా అక్కర్లేదు నాన్నా! రూపాయి వడ్డీతో అప్పుగా ఇవ్వు. నోటు రాసేందుకు రెవెన్యూ స్టాంపులు కూడా తెచ్చాం” మూడో కూతురు వేడికోలు.

దూరపు బంధువులు కూడా ఆర్థిక సహాయాన్ని కోరే వచ్చారు.

వీళ్ళంతా ఎవరు? వీళ్ళకూ, వీళ్ళ బాబులకూ, తాతలకూ బాకీయా తాను? తాను ఆర్థిక బాధల్లో ఉండగా వీళ్ళలో ఎవరైనా సహాయం చేయకుంటే మానె కనీసం సానుభూతిగా నన్నా ఒక్క మాట అన్నారా?

వీరయ్యకు రక్తం మరిగిపోతోంది. ఏమనీ చెప్పలేదు. ఈ పిచ్చి లచ్చి మెచ్చి వొస్తూ వీళ్ళందర్నీ రెచ్చగొట్టి తన పరివారాన్ని వెంటబెట్టుకు వచ్చింది.

తనకూ అప్పులున్నాయనీ, తన పరిస్థితి కూడా బాగాలేదనీ, తానేమీ సర్దలేననీ మృదువుగా చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. కాస్త కఠినంగా కూడా చెప్పవలసి వొచ్చింది. అందరూ పోతూ పోతూ దుమ్మెత్తి పోశారు. తనను దుర్మార్గుడన్నారు. స్వార్థపరుడన్నారు. ధనమదాంధుడన్నారు. నోటి కొచ్చినట్లల్లా తిట్టి మరీ వెళ్ళారు.

ఈ బోడి లాటరీ రాకుంటే ఎంత బాగుండేది- ఎంతమందితో - అందునా రక్తసంబంధం ఉన్న వారితో విరోధాలు వచ్చాయి. తాను అందరికీ విషప్రాయంగానూ, తన డబ్బు మాత్రం అమృతప్రాయంగానూ ఉన్నది.

ఇంట్లో కూడా సంగీతం ఆరంభమైంది.

"ఇరుగు పొరుగులకు ఒక్కో ఇల్లాలికి కనీసం ఆరు పట్టు చీరలన్నా ఉన్నాయి. నాకో కాపరానికి వచ్చినప్పటి నుంచి ఈ నూలు చీరలేగా! నగా నాణ్యమా? పేరంటానికి వెళ్ళాలంటే ఎంత బాధగా ఉంటుందో తెలుసా?" ఇల్లాలి సాధింపులు.

"పక్క ఇళ్ళ వాళ్ళందరికీ టి.వి.లు మనకో - సరైన ట్రాన్‌సిస్టర్ కూడా లేదు. నా ఈడువాళ్ళంతా టెరిలిన్‌లూ, బెరిలిన్లూ వేస్తే నేను ఈ వెధవ నూలుబట్టలే కట్టుకోవలసిన ఖర్మ!" కొడుకు సాధింపులు.

ప్రశాంతంగా సాగిపోతున్న సంసారంలో కలతలూ, మనస్పర్థలూ, ద్వేషాలూ రగులుకుంటున్నాయి.

వీరయ్య ఇవేవీ లెక్కచెయ్యలేదు. ఇంటి మీది అప్పు తీర్చాడు. మరో రెండు గదులు కట్టించాడు. కొడుకు పెళ్ళి చేశాడు. ఉన్నదంతా ఖర్చు చేసి చేతులు దులుపుకున్నాడు. లచ్చి వొచ్చి తీర్చిన సమస్యల కన్నా సృష్టించినవే ఎక్కువ!

లచ్చి తెచ్చిన రొచ్చులోంచి బైటపడేప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది వీరయ్యకు.

పూర్వం వలె తిండికీ, బట్టకూ లోటులేని ప్రశాంత జీవనం ఆరంభమైంది.

చిత్రం - వీరయ్య పిర్రలమీది దురద మాయమైంది. నిజంగా దురద పుట్టినా వీరయ్య గోక్కునేందుకే భయపడుతున్నాడు.

ఆలోచిస్తే ఆ మొదటి బహుమతి అయిదు లక్షలు వొచ్చినా ఈ జనసందోహాన్ని తృప్తిపరచటం సాధ్యమయేది కాదని స్పష్టంగా తెలుస్తోంది.

చెప్పనక్కర్లేదు - వీరయ్య లాటరీ టికెట్లు కొనటం మానేశాడు.

'లోగడ ఒక వరస అదృష్టం వరించిందిగా-మరోసారి ప్రయత్నించకూడదా? అని ఎవరైనా అంటే-

'నాకు వొద్దు బాబూ! లచ్చి మెచ్చి వచ్చి పడిందంటే, రొచ్చు తప్పదు. పుచ్చె లేచినా ఆశ్చర్యం లేదు. లచ్చి పేరు ఎత్తకండి' అంటాడు వీరయ్య.

లక్ష్మీదేవి అనేక మందికి ఆరాధ్యదైవమైతే వీరయ్యకు మాత్రం పీడకల!

*- ఆంధ్రప్రభ వారపత్రిక, 29.4.87*